నూకల నరేశ్‌రెడ్డి కన్నుమూత

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీశ్ సంతాపం

నరేశ్‌రెడ్డి (ఫైల్)

మహబూబాబాద్, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ): ఉమ్మడి వరంగల్ జిల్లా సీనియర్ నాయకుడు నూకల నరేశ్‌రెడ్డి కన్నుమూశారు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతూ శుక్రవారం మరణించారు. నరేశ్‌రెడ్డి స్వస్థలం మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం పురుషోత్తమాయగూడెం. 1989లో కాంగ్రెస్ పార్టీ నుంచి డోర్నకల్ స్థానాన్ని ఆశించినా టికెట్ దక్కలేదు. 1994లో ఇండిపెండెంట్ అభ్యర్థిగా, 1999లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేశారు. 2012 ఉద్యమ సమయంలో టీఆర్ఎస్‌లో చేరి 2024 వరకు బీఆర్ఎస్ కోసం సుదీర్ఘ కాలం పనిచేశారు. 2024 ఫిబ్రవరిలో ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరారు.

కేటీఆర్ దిగ్భ్రాంతి

సీనియర్ నేత నూకల నరేశ్‌రెడ్డి మృతి పట్ల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దిగ్భ్రాంతి చెందారు. దవాఖానలో చేరిన నరేశ్‌రెడ్డిని నాలుగైదు రోజుల క్రితమే కేటీఆర్ పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన మరణవార్త వినాల్సి వస్తుందని అనుకోలేదని అన్నారు. వారి కుటుంబ సభ్యులకు కేటీఆర్ తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

హరీశ్ తదితరుల నివాళులు..

నూకల నరేశ్‌రెడ్డి మరణవార్త విషయం తెలియగానే మాజీ మంత్రి హరీశ్‌రావు శాసన మండలిలో విపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఆర్ ఎస్ ప్రవీణ్‌కుమార్, అధికార ప్రతినిధి కేతిరెడ్డి వాసుదేవరెడ్డి తదితరులు దవాఖానకు వెళ్లి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో నూకల నరేశ్‌రెడ్డి రాజకీయంగా అందించిన సేవలను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు.

దొడ్డు వడ్లకూ బోనస్ ఇవ్వాల్సిందే

- సన్నాలకే ఇస్తామనడం మోసం
- అందరికీ రుణమాఫీ చేయాల్సిందే
- రైతుభరోసా ఇస్తరా? ఇవ్వరా?
- హామీలు తీర్చకపోతే పోరాటమే
- సీఎం రేవంత్‌రెడ్డికి కేటీఆర్ లేఖ

హైదరాబాద్, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ): రైతులకు ఇచ్చిన హామీల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు మండిపడ్డారు. రైతులు పండించే ప్రతి క్వింటా ధాన్యానికి రూ.500 బోనస్ చెల్లిస్తామంటూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీని వెంటనే అమలుచేయాలని డిమాండ్ చేశారు. గురువారం జరిగిన సమీక్షా సమావేశంలో దొడ్డువడ్లకు బోనస్, వానకాలం రైతుభరోసాపై ఎటూ తేల్చకుండా ప్రభుత్వం కప్పదాటుగా వ్యవహరించిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. వానకాలం సీజన్ పూర్తయినా రైతుభరోసాపై నిర్ణయం తీసుకోకపోవడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ఈ మేరకు కేటీఆర్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి శుక్రవారం లేఖ రాశారు. రైతులు పండించే ప్రతి క్వింటాల్ ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామని కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో స్పష్టంగా ప్రకటించారని కేటీఆర్ గుర్తుచేశారు. బోనస్ చెల్లించకుండా గత సీజన్‌లో ప్రభుత్వం మోసం చేసిందని, ఈ సీజన్‌లో కూడా ఇప్పటివరకు దొడ్డు వడ్లకు బోనస్ విషయంలో ఎలాంటి స్పష్టతలేకపోవడంతో రైతులు అయోమంలో పడ్డారని తెలిపారు. సన్నవడ్లకు మాత్రమే బోనస్ అని ముఖ్యమంత్రి పేర్కొనడం రైతులను మోసం చేయడమేనని దుయ్యబట్టారు. రాష్ట్రంలో 80 శాతానికిపైగా రైతులు పండించేవి దొడ్డు వడ్లన్న సంగతి కాంగ్రెస్ పార్టీకి తెలసని పేర్కొన్నారు. సన్నవడ్లు, దొడ్లువడ్లు అనే తేడా లేకుండా మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం మాట నిలుపుకోవాలని, గత సీజన్ బకాయిలను కూడా తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు అన్ని రకాలకు బోనస్ ఇస్తామని చెప్పి, ఇప్పుడు సన్నాలకే అంటూ సన్నాయినొక్కులు నొక్కడం రైతులను నిలువునా మోసం చేయడమేనని ఆగ్రహం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ పార్టీ రైతులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోకపోతే రైతులపక్షాన బీఆర్ఎస్ పోరుబాటు పడుతుందని హెచ్చరించారు.

రైతు భరోసా ఊసేదీ?

వానకాలం సీజన్ పూర్తయినా రైతుభరోసా సంగతి తేల్చడం లేదని కేటీఆర్ మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రైతుభరోసా పేరిట ఎకరాకు రూ.7,500 ఇస్తామని నాడు పీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్‌రెడ్డి ప్రకటించిన విషయం వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. గత సీజన్‌లో రైతులకు రైతుబంధు పైసలు మాత్రమే వేశారని, ఈ సీజన్‌లో ఇప్పటివరకు అసలు రైతుభరోసా సంగతే తేల్చడం లేదని దుయ్యబట్టారు. నాట్లు వేసే సమయంలో అందించాల్సిన పెట్టుబడి సాయాన్ని పంట చేతికొచ్చే వరకు కూడా ఇవ్వకపోవడమంటే రైతుల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఏమిటో అర్థమవుతున్నదని పేర్కొన్నారు. మూసీ ప్రక్షాళన కోసం రూ.లక్షన్నర కోట్లు ఖర్చు పెట్టేందుకు తహతహలాడుతున్న ముఖ్యమంత్రికి రైతులకు రైతుభరోసా వేసేందుకు పైసలు లేవా? అని ప్రశ్నించారు. మూసీ పేరుతో చేసే అవినీతి ఆలోచనలను మాని రైతులకు ఇచ్చిన హామీలపై దృష్టి సారించాలని హితవు పలికారు. రైతును రాజును చేయాలన్న దృఢ సంకల్పంతో కేసీఆర్ ప్రవేశపెట్టిన రైతుబంధు వ్యవసాయం రంగంలో విప్లవాత్మక మార్పు తెచ్చిందని కేటీఆర్ పేర్కొన్నారు. కేసీఆర్ ఏటా రూ.10 వేలు ముష్టి వేస్తున్నారని, తాము అధికారంలోకి వచ్చిన మరుక్షణం నుంచే రూ.15 వేలు ఇస్తామంటూ రేవంత్‌రెడ్డి చెప్పిన మాట విని రైతులు ఆశపడ్డారని తెలిపారు. రూ.15 వేల సంగతేమోగానీ ఆ రూ.10 వేలు కూడా ఇవ్వకుండా రైతును గోస పెడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. రైతుభరోసా ఇస్తారో, ఇవ్వరో ప్రభుత్వం స్పష్టంచేయాలని డిమాండ్ చేశారు. గత సీజన్ సాయంతోపాటు ఈసీజన్‌వి కూడా జతచేసి రైతుల ఖాతాలో జమ చేయాలని డిమాండ్ చేశారు.

రుణమాఫీ పేరుతో వంచన.. వ్యవసాయ మంత్రి ప్రకటనే సాక్ష్యం

వందశాతం రుణమాఫీ అయిందని చెప్పిన ముఖ్యమంత్రి బండారం వ్యవసాయ శాఖ మంత్రి ప్రకటనతో బట్టబయలైందని కేటీఆర్ ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో ఇంకా 20 లక్షల మంది రైతులకు రుణమాఫీ కాలేదని వ్యవసాయశాఖ మంత్రి ప్రకటించడంతో ముఖ్యమంత్రి మాటల్లో నిజం లేదని తేలిపోయిందని పేర్కొన్నారు. అధికారిక లెక్కల ప్రకారమే 20 లక్షల మంది రైతులకు రుణమాఫీ కాలేదంటే అనధికార లెక్కల ప్రకారం ఇంకా ఎంతమంది రైతులు ఉంటారో అర్థం చేసుకోవచ్చని ఉదహరించారు. రుణమాఫీని పక్కనపెట్టి మూసీ పేరుతో వేలకోట్లు దోపిడీ చేయాలనుకుంటున్న రాబందుల ప్రభుత్వం ఉండి రైతులకు ఏం లాభమని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి చేతకానితనం అన్నదాతలకు కోలుకోలేని శాపంగా మారిందని ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్రంలో రైతులందరికీ రుణమాఫీ చేయకపోతే ఊరుకునేదిలేదని హెచ్చరించారు.

సోయాకు సీలింగ్ ఎందుకు?

- మొత్తం పంటను ప్రభుత్వమే కొనాలి
- సోయా రైతులకు 500 బోనస్ ఇవ్వాలి
- రివ్యూ మీటింగ్‌కు గంటల ముందు సమాచారమా?
- కాంగ్రెస్ సర్కారు తీరుపై ఎమ్మెల్యే ప్రశాంత్ ఆగ్రహం

నిజామాబాద్, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణప్రతినిధి): సోయా కొనుగోళ్లపై సీలింగ్ విధించడాన్ని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. సోయా దిగుబడి ఎకరానికి 10 నుంచి 12 క్వింటాళ్లు వస్తుంటే ప్రభుత్వం 6 క్వింటాళ్లు మాత్రమే తీసుకుంటామనడం విడ్డూరమని ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మిగతా పంటను అమ్ముకోవాలంటే రైతులు మళ్లీ ప్రైవేటు వ్యాపారుల చుట్టూ తిరగాల్నా? రూ.4,300లకే అమ్ముకోవాల్నా? అని ప్రశ్నించారు. ప్రభుత్వమే మొత్తం పంటను కనీస మద్దతు ధరకు కొనుగోలు చేయాలని, అలాగే క్వింటాల్‌కు రూ.500 చొప్పున బోనస్ చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోయా మద్దతు ధర రూ.4,892 కాగా, బోనస్ కలిపి రూ.5,392 చొప్పున రైతుకు ఇవ్వాలని సూచించారు. ఎన్నికల ముందు ప్రతి పంటకు బోనస్ ఇస్తామన్న కాంగ్రెస్.. రైతుల పొట్ట కొట్టొద్దని హితవు పలికారు.

మీటింగ్‌కు రావొద్దనే..

నిజామాబాద్ జిల్లా పర్యటనకు వస్తున్న మంత్రులు.. ప్రభుత్వ యంత్రాంగంతో నిర్వహించే సమీక్షకు సంబంధించిన సమాచారాన్ని సరిగా ఇవ్వలేదని వేముల తప్పుబట్టారు. సమాచారాన్ని ఆలస్యంగా ఇచ్చిన కారణంగా సమీక్షకు హాజరుకాలేని పరిస్థితిలో వేముల వీడియో సందేశాన్ని మీడియాకు విడుదల చేశారు. శుక్రవారం మంత్రుల టూర్ ఉంటే, అదే రోజు కేవలం గంటల ముందే సమాచారం ఇవ్వడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా తాను మీటింగ్‌కు రావొద్దనే ఉద్దేశంతో ఇదంతా చేశారని మండిపడ్డారు. తన నియోజకవర్గ సమస్యలపై, అభివృద్ధి కార్యక్రమాల అమలుపై ప్రశ్నిస్తాననే భయంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు.

బీఆర్ఎస్ నాయకుడి ఇంటి నిర్మాణం కూల్చివేత

- కాంగ్రెస్ నేతల ఒత్తిడితోనే కూల్చివేత
- బాధితుడు లక్ష్మణ్ నాయక్ ఆవేదన

నాగార్జునసాగర్ మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న లక్ష్మణ్ నాయక్ కుటుంబ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు

నందికొండ, అక్టోబర్ 4 : నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ పైలాన్‌కాలనీలో పట్టణ బీఆర్ఎస్ మాజీ కార్యదర్శి ముడావత్ లక్ష్మణ్ నాయక్ నిర్మిస్తున్న ఇంటిని మున్సిపల్ కమిషనర్ శ్రీను, సూపర్‌వైజర్ శివ తమ సిబ్బందితో కలిసి శుక్రవారం కూల్చి వేశారు. తాము ఇంటి నిర్మాణం చేపడుతున్న స్థలంలో 50 ఏండ్లకు పైగా నివాసం ఉంటున్నామని ఇంటి యజమాని ముడావత్ లక్ష్మణ్ నాయక్ తెలిపారు. ఇంటి పక్కన దారి విషయమై స్థానికులు అభ్యంతరం చెప్పడంతో గత నెల 27న పెద్దల సమక్షంలో మాట్లాడి ఇంటి నిర్మాణ పనులను కొనసాగిస్తున్నట్టు పేర్కొన్నారు. కానీ అధికారులకు తమకు సమాచారం ఇవ్వకుండానే నిర్మాణ గోడలను కూల్చి వేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకుల ఒత్తిడితోనే కూల్చివేతలు చేపట్టారని లక్ష్మణ్ ఆరోపించారు. తమకు న్యాయం చేయాలని మున్సిపల్ కార్యాలయం ఎదుట బాధితుడు లక్ష్మణ్‌నాయక్ కుటుంబ సభ్యులు నిరసన తెలిపారు. అనంతరం కమిషనర్ తీరుపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇంటి నిర్మాణం రోడ్డుకు అడ్డంగా ఉన్నట్టు స్థానికుల ఫిర్యాదు మేరకు చర్యలు చేపట్టినట్టు కమిషనర్ తెలిపారు.

సింగరేణిలో నికర లాభాల వాటా సాధిస్తాం

- 6న బీఆర్ఎస్, టీబీజీకేఎస్ నిరసన దీక్ష
- సకలజనులు హాజరై విజయవంతం చేయాలి
- మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పిలుపు

గోదావరిఖనిలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్. చిత్రంలో టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, తదితరులు

గోదావరిఖని, అక్టోబర్ 4: సింగరేణి నికర లాభాల్లో కార్మికులకు 33శాతం వాటా చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 6న పెద్దపల్లి జిల్లా గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ, టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేపట్టనున్నట్టు రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ తెలిపారు. సింగరేణి కార్మికులు, సకలజనులంతా ఈ దీక్షలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడారు. సింగరేణి లాభాలపై రేవంత్ సర్కార్ కార్మికులను నట్టేట ముంచి 50 శాతం కోత విధించి మోసం చేసిందని మండిపడ్డారు. భారీ మొత్తంలో లాభాల వాటా (33 శాతం) పంచుతున్నట్టు ప్రచారం చేసుకుంటున్న కాంగ్రెస్.. కార్మికులకు అందించింది మాత్రం కొంతేనని పేర్కొన్నారు. కార్మికుల కష్టానికి గుర్తింపుగా నికర లాభాల నుంచి కార్మికులకు వాటాను అందించింది తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ మాత్రమేనని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రం ఏర్పడిన తొలి ఏడాది 2014-15లోనే 21శాతం, 2022-23లో 32శాతం లాభాల వాటా ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు.

పేదలకో న్యాయం.. పెద్దలకో న్యాయమా?

- సీఎం సోదరుడికి నోటీసులిచ్చినా చర్యలు శూన్యం
- హైడ్రా కూల్చివేతలపై హైకోర్టులో కేఏ పాల్ పిల్
- రాష్ట్ర ప్రభుత్వానికి ధర్మాసనం నోటీసులు

హైదరాబాద్, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ): పేదవాడికో న్యాయం, పెద్దలకో న్యాయం అన్నట్టుగా హైడ్రా చర్యలు ఉన్నాయని ప్రజా శాంతి పార్టీ అధ్యక్షుడు డాక్టర్ కేఏ పాల్ ఆరోపించారు. పేదల ఇండ్ల కూల్చివేతల విషయంలో నోటీసులు కూడా ఇవ్వడం లేదని, అదే సీఎం సోదరుడికి నోటీసు ఇచ్చారేగానీ చర్యలు తీసుకోలేదని చెప్పారు. హైడ్రా కూల్చివేతలను సవాలుచేస్తూ కేఏ పాల్ చేసిన పిల్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావుతో కూడిన ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. కేఏ పాల్ వాదనలు వినిపిస్తూ, చెరువుల రక్షణకు చేపట్టిన చర్యలను నిబంధనల ప్రకారం అమలు చేయడంలేదని చెప్పారు. పేదల నిర్మాణాలను కూల్చివేస్తున్న హైడ్రా సంపన్నుల విషయంలో ఉదాసీనంగా ఉన్నదని తెలిపారు. ఇందుకు సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడి ఇల్లే నిదర్శనమని చెప్పారు. హైడ్రా వివక్షతో వ్యవహరిస్తున్నదని అంటూ సీఎం సోదరుడి ఇంటి విషయంలో హైడ్రా 32 రోజుల క్రితం నోటీసులు ఇచ్చినా చర్యలు చేపట్టకపోవడం అందుకు ప్రధాన ఉదాహరణ అని తెలిపారు. తన పిల్‌పై విచారణ ముగిసే వరకు ఏవిధమైన కూల్చివేత చర్యలు తీసుకోకుండా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. ప్రభుత్వ వాదనలు వినకుండా స్టే ఆదేశాలు జారీ చేయబోమని ధర్మాసనం స్పష్టం చేసింది. ప్రభుత్వానికి నోటీసులు జారీ చేస్తున్నామని, ప్రభుత్వ స్పందన చూశాక తగిన ఉత్తర్వులు జారీ చేస్తామని పేర్కొంది. ప్రతివాదులైన మున్సిపల్ శాఖ ముఖ్యకార్యదర్శి, హైడ్రాలకు నోటీసులు జారీ చేస్తూ విచారణను వాయిదా వేసింది.

టౌన్ ప్లానింగ్ అధికారికి ముందస్తు బెయిల్

హైదరాబాద్, అక్టోబర్ 4, (నమస్తే తెలంగాణ): రంగారెడ్డి జిల్లా నిజాంపేట ప్రగతినగర్‌లోని ఎర్రకుంట చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో అక్రమ నిర్మాణాలకు అనుమతించారన్న కారణంగా హైడ్రా నమోదు చేసిన కేసులో హెచ్ఎండీఏ అసిస్టెంట్ టౌన్‌ప్లానింగ్ అధికారి సుధీర్‌కుమార్‌కు హైకోర్టులో శుక్రవారం ఊరట లభించింది. హైడ్రా ఫిర్యాదు మేరకు నమోదు చేసిన కేసులో సుధీర్‌కుమార్‌కు షరతులతో ముందస్తు బెయిలు మంజూరు చేసింది. హైడ్రా ఫిర్యాదు మేరకు నమోదైన కేసులో నిందితుడిగా ఉన్న జీహెచ్ ఎంసీ డిప్యూటీ కమిషనర్ ఎన్ సుదాంశ్ దాఖలు చేసిన మరో పిటిషన్‌పై విచారణను ఈ నెల 22కి వాయిదా వేశారు.

తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, చిత్రంలో బీఆర్ఎస్ నాయకులు గట్టు రాంచందర్‌రావు, మన్నె గోవర్ధన్‌రెడ్డి, పార్టీ లీగల్ టీమ్ సభ్యులు జక్కుల లక్ష్మణ్‌యదవ్, కల్యాణ్, లలితారెడ్డి, గోపగాని రఘురామ్

చెన్నూరుకు ఉప ఎన్నిక ఖాయం!

- సూట్‌కేస్ కంపెనీలకు డబ్బులు పంపిన కేసులో ఎమ్మెల్యే వివేక్ జైలుకు పోకతప్పదు
- రేవంత్‌రెడ్డే కాదు, దేవుడు కూడా కాపాడలేడు
- ఈడీ విచారిస్తున్న కేసును మిస్టేక్ ఆఫ్ ఫ్యాక్ట్ కింద పోలీసులు ముగించే ప్రయత్నం చేస్తున్నరు
- మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్

హైదరాబాద్, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ): చెన్నూరు నియోజకవర్గానికి ఉప ఎన్నికలు రావడం ఖాయమని, సూట్‌కేస్ కంపెనీలకు డబ్బులు పంపిన వ్యవహారంలో ఎమ్మెల్యే వివేక్ జైలుకు పోక తప్పదని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ చెప్పారు. ఎమ్మెల్యే వివేక్‌ను సీఎం కాపాడే ప్రయత్నం చేస్తున్నారని, రేవంత్‌రెడ్డే కాదు.. దేవుడు కూడా వివేక్‌ను కాపాడలేరని పేర్కొన్నారు. తెలంగాణలో కొందరు పోలీస్ అధికారులకు స్వామిభక్తి ఎక్కువైందని, రేవంత్‌రెడ్డి అడుగులకు మడుగులొత్తుతున్నారని విమర్శించారు. ఈకేసును ఈడీ దర్యాప్తు చేస్తుంటే, మరోవైపు మిస్టేక్ ఆఫ్ ఫ్యాక్ట్ కింద పోలీసులు కేసును ముగించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ కేసులో హైకోర్టు, అవసరమైతే సుప్రీంకు వెళ్తామని పేర్కొన్నారు. శుక్రవారం తెలంగాణభవన్‌లో బీఆర్ఎస్ లీగల్ సెల్ ప్రతినిధులతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా వివేక్ తన విశాఖ కంపెనీ నుంచి విజిలెన్స్ సెక్యూరిటీ అనే సూట్‌కేస్ కంపెనీకి రూ.8 కోట్లు అక్రమంగా బదిలీ చేసి చెన్నూరు ఎమ్మెల్యేగా గెలిచినట్టు తాను ఆనాడే ఈసీకి ఫిర్యాదు చేశానని చెప్పారు. ఫిర్యాదుపై స్పందించిన ఈసీ, ఐటీ, ఈడీతోపాటు రాష్ట్ర పోలీసులకు సైతం విచారణ జరపాలని ఆదేశాలు జారీచేసిందని తెలిపారు. వివేక్ సూట్‌కేసు కంపెనీకి అక్రమంగా నగదు బదిలీ చేశారని, ఫెమా ఉల్లంఘనలు ఉన్నాయని 2023 నవంబర్ 23న ఈడీ ప్రెస్ నోట్‌లో నిర్ధారించినట్టు పేర్కొన్నారు. ఆ ప్రెస్ నోట్‌ను సుమన్ మీడియాకు చూపించారు. జనవరి 24న వివేక్‌ను ఈడీ విచారించిందని వెల్లడించారు. ఈడీ విచారణ కొనసాగుతుంటే పోలీసులు మాత్రం ఆగస్టులో ఈ కేసును మిస్టేక్ ఆఫ్ ఫ్యాక్ట్ కింద మూసి వేస్తున్నట్టు కోర్టుకు పిటిషన్ ద్వారా తెలిపారని మండిపడ్డారు. ఈ పిటిషన్‌ను సవాల్ చేస్తూ నాంపల్లి కోర్టులో శుక్రవారం ప్రొటెస్ట్ పిటిషన్ వేశామని పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి దగ్గర హోంశాఖ ఉంది కనుక వివేక్‌ను కాపాడేయత్నం చేస్తున్నారని ఆరోపించారు.

రేవంత్ విషకౌగిలిలో బంటీ కావద్దు

రాష్ట్రంలో కొందరు పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని, రేవంత్‌రెడ్డి విషకౌగిలిలో పోలీసుల బందీ కావొద్దని బాల్క సుమన్ సూచించారు. ప్రభుత్వం అనేది నిరంతర ప్రక్రియ అని పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి ఏది చెబితే పోలీసులు అది చేస్తారా? అని ప్రశ్నించారు. ఇన్‌కం ట్యాక్స్, ఈడీ లోతైన విచారణ చేస్తుంటే రాష్ట్ర పోలీసులు వివేక్ కేసును ఎలా మూసేస్తారు? అని నిలదీశారు. ఏపీలో ఏం జరుగుతున్నదో ఇక్కడి పోలీసు అధికారులు చూడటం లేదా? అని ప్రశ్నించారు. జర్నలిస్టులపై దాడులు పెరిగిపోయాయని, అయినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. అత్యుత్సాహం ప్రదర్శిస్తున్న పోలీసులకు భవిష్యత్తులో నష్టం తప్పదని హెచ్చరించారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు గట్టు రాంచందర్‌రావు, మన్నె గోవర్ధన్‌రెడ్డి, పార్టీ లీగల్ టీమ్ సభ్యులు జక్కుల లక్ష్మణ్‌యదవ్, కల్యాణ్, లలితారెడ్డి, గోపగాని రఘురామ్ పాల్గొన్నారు.

గ్రూప్-1 వివాదంపై హైకోర్టు తీర్పు వాయిదా

2022 నోటిఫికేషన్‌ను రద్దు చేయకుండా, మరో నోటిఫికేషన్ వేయడంపై అభ్యర్థులు పిటిషన్

హైదరాబాద్, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ): గ్రూప్-1 పరీక్షల నిర్వహణకు సంబంధించిన వివాదంపై హైకోర్టు తన తీర్పును వాయిదా వేసింది. ఈ వ్యవహారంలో ఇరుపక్షాల వాదనలు ముగియడంతో తీర్పును తర్వాత వెలువరిస్తామని ప్రకటించింది. గ్రూప్-1 పోస్టుల భర్తీ కోసం 2022లో జారీ చేసిన నోటిఫికేషన్‌ను రద్దు చేయకుండా ప్రభుత్వం మరో నోటిఫికేషన్‌ను జారీ చేయడం చెల్లదని పేర్కొంటూ పలువురు అభ్యర్థులు దాఖలు చేసిన పిటిషన్లపై జస్టిస్ పుల్లా కార్తీక్ శుక్రవారం విచారణ జరిపారు. తొలుత ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది రాహుల్‌రెడ్డి వాదన వినిపిస్తూ.. పరీక్షల నిర్వహణలో ఎలాంటి అవతకవకలు జరగలేదని తెలిపారు. కీపై అభ్యర్థులు లేవనెత్తిన అభ్యంతరాలను నిపుణుల కమిటీకి సిఫారసు చేశామని, ఆ కమిటీ సిఫారసుల మేరకు రెండు ప్రశ్నలను తొలగించారని వివరించారు. పిటిషనర్లు చెప్తున్నట్టుగా 7 ప్రశ్నలకు జవాబులు తప్పుగా రాలేదని చెప్పారు. ఇప్పటికే పరీక్షల నిర్వహణలో జాప్యం జరగడం వల్ల అభ్యర్థులు నష్టపోయారని, ఈ దశలో పిటిషనర్ల వ్యాజ్యాలపై పిటిషన్లపై ఉత్తర్వులు జారీచేస్తే నిరుద్యోగులు తీవ్రంగా నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో పిటిషనర్ల వ్యాజ్యాలను కొట్టివేయాలని కోరారు. దీనిపై పిటిషనర్ల తరపు న్యాయవాదులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. గ్రూప్-1 పరీక్షలో దాదాపు 7 ప్రశ్నలకు సమాధానాలు తప్పుగా ఉన్నాయని తెలిపారు. ఆ సమాధానాలకు దేన్ని ప్రామాణికంగా తీసుకోవాలన్న దానిపై టీజీపీఎస్సీకి స్పష్టత లేదని, కొన్నింటికి తెలుగు అకాడమీని, మరికొన్నింటికి వికీపీడియాను ప్రామాణికంగా తీసుకుని ప్రాథమిక కీని విడుదల చేశారని వివరించారు. గతంలో కూడా ఇదే హైకోర్టు గ్రూప్-1 పరీక్షను రద్దు చేసినప్పటికీ పొరపాట్లను సరిదిద్దుకోలేదని, నిరుద్యోగుల జీవితాలతో పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆటలాడుకుంటున్నదని పేర్కొన్నారు. ఇరుపక్షాల వాదనలు పూర్తికావడంతో తీర్పును తర్వాత ప్రకటిస్తానని జస్టిస్ పుల్లా కార్తీక్ తెలిపారు.

ఎమ్మెల్యే చెప్పిండని.. తిరుమలగిరి ఎస్సై కొట్టిండు!

- మెడకు ఉరితాడుతో యువకుడి సెల్ఫీ వీడియో
- ఆత్మహత్యాయత్నంతో పరిస్థితి విషమం
- శాలిగౌరారం మండలం ఆకారంలో ఘటన

చికిత్స పొందుతున్న నాగరాజు

నల్లగొండ ప్రతినిధి, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ)/శాలిగౌరారం/ తిరుమలగిరి/ తుంగుతుర్తి : తనకు సంబంధం లేకపోయినా డీజిల్ దొంగతనం పేరుతో ఎస్సై తీవ్రంగా కొట్టాడన్న ఆవేదనతో నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం ఆకారంలో ఓ యువకుడు ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన శనిగ నాగరాజు సూర్యాపేట జిల్లా తొండ గ్రామంలోని గొలుసుల వెంకన్న నిర్వహణలో ఉన్న బాలాజీ స్టోన్ క్రషర్ మిల్లులో టిప్పర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. యజమాని వద్దనడంతో పని మానేశాడు. రెండు నెలల జీతం రావాల్సి ఉందని నాగరాజు కొద్దిరోజుల కిందట యజమానికి ఫోన్ చేశాడు. యజమాని జీతం ఇవ్వకపోగా డీజిల్ దొంగతనం జరిగిందంటూ నాగరాజుతోపాటు మరికొందరిపై తిరుమలగిరి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. వెంకన్న స్థానిక ఎమ్మెల్యేను సైతం ఆశ్రయించి ఎస్సైకి ఫోన్ చేయించాడు. దీంతో తిరుమలగిరి ఎస్సై వంటెపాక సురేశ్, నాగరాజుకు ఫోన్ చేస్తూ స్టేషన్‌కు రమ్మంటున్నాడు. తనకు సంబంధం లేదని నాగరాజు వెళ్లకపోయే సరికి బుధవారం ఎస్సై ఫోన్ చేసి మందలించాడు. గురువారం నాగరాజు తన బావమరిది, తమ్ముడిని వెంట పెట్టుకుని పోలీస్ స్టేషన్‌కు వెళ్లాడు. విచారణ పేరుతో ఎస్సై నాగరాజు, అతడి తమ్ముడిని తీవ్రంగా చితకబాది మళ్లీ